సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం । 15 । మే । 2024



హత్య కేసు నిందితులపై హత్యాయత్నం

తన భార్యను హత్య చేశారన్న అక్కసుతో పాత కక్షను దృష్టిలో పెట్టుకుని భర్త ఓ కుటుంబంపై మంగళవారం హత్యాయత్నానికి పాల్పడ్డాడు.

8లో



వైఎస్సార్‌ సీపీ నేతలపై టీడీపీ దాడులు

పోలింగ్‌ ముగిసినా ఇంకా టీడీపీ నేతల దాడులు ఆగడం లేదు. వైఎస్సార్‌ సీపీ నాయకులపై దాడికి తెగబడడంతో ఆత్రేయపురంలో ఘర్షణ వాతావరణం నెలకొంది.

గరిష్టం/కనిష్టం
38.0°/24.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	38.0	24.0
కాకినాడ	36.2	27.0
అమలాపురం	39.0	28.0

భవిత భద్రం

- జిల్లాలో 80.93 శాతం పోలింగ్‌
- అర్ధరాత్రి వరకూ క్యూలో నిలబడి ఓటెత్తిన మహిళలు
- స్ట్రాంగ్‌ రూముకు చేరిన ఈవీఎంలు
- గెలుపోటములపై అంచనాల్లో నేతల తలమునకలు



కొవ్వూరు జెడ్పీ హైస్కూలులో పోలింగ్‌కు పోటెత్తిన ఓటర్లు (ఫైల్‌)

సాక్షి, రాజమహేంద్రవరం: దాదాపు 40 డిగ్రీల సెల్సియస్‌కు పైబడిన ఉష్ణోగ్రతలతో కొద్ది నెలలుగా చెలరేగిపోయిన సూర్యుడు కొద్ది రోజులుగా కాస్త శాంతిస్తున్నాడు. వాతావరణ మార్పులతో ఉష్ణ తాపం నుంచి కాస్త విరామం లభిస్తోంది. మండిపోయిన ఎండలకు తోడా అన్నట్టుగా కొద్ది నెలలుగా పెరిగిన పొలిటికల్‌ హీట్‌కు కూడా ప్రస్తుతానికి తెర పడింది. సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్‌ ప్రక్రియ చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా పూర్తి కావడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఈ ఎన్నికల్లో ఓటర్లు మునుపెన్నడూ చూడని విధంగా భారీ సంఖ్యలో పోలింగ్‌ కేంద్రాలకు తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల భవితవ్యం ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ యంత్రాల్లో (ఈవీఎం) నిక్షిప్తమైంది. వచ్చే నెల 4న జరిగే ఓట్ల లెక్కింపులో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

అర్ధరాత్రి వరకూ పోలింగ్‌

ఈ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా భారీ స్థాయిలోనే పోలింగ్‌ శాతం నమోదైంది. మధ్యాహ్నం కాస్త మందకొడిగా నమోదైనా.. సాయంత్రం ఓటర్లు అధిక సంఖ్యలో పోటెత్తారు. మహిళలు అత్యధికంగా ఓటు బాట పట్టడం విశేషం. సాయంత్రం 6 గంటల వరకూ క్యూలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో కొన్ని కేంద్రాల్లో అర్ధరాత్రి వరకూ పోలింగ్‌ జరిగింది. అనంతరం రాజమండ్రి లోక్‌సభ నియోజకవర్గంతో పాటు, దీని పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన ఈవీఎంలను రాజానగరం సమీపంలోని నన్నయ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌ రూములకు తరలించారు. సాయంత్రం 5 గంటలకు 66.55 శాతం ఓటింగ్‌ జరగగా.. పోలింగ్‌ ముగిసే సమయానికి అది ఏకంగా 80.93 శాతానికి చేరింది.

- జిల్లావ్యాప్తంగా మొత్తం 16,23,149 మంది ఓటర్లు ఉండగా వీరిలో 13,13,645 మంది ఓట్లు వేశారు. వీరిలో పురుషులు 6,47,474 మంది ఉండగా, అత్యధికంగా 6,66,113 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- జిల్లాలో అత్యధికంగా రాజానగరం నియోజకవర్గంలో 87.53 శాతం పోలింగ్‌ నమోదైంది.
- అత్యల్పంగా రాజమండ్రి సిటీలో 67.57 శాతం మంది మాత్రమే ఓటు వేశారు. అయితే, 2019 ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటింగ్‌ కాస్త పెరిగింది. ఆ ఎన్నికల్లో ఇక్కడ 66.19 శాతం ఓటింగ్‌ నమోదైంది.
- అనపర్తిలో 86.23, కొవ్వూరు 85.90, నిడదవోలు 84.67, గోపాలపురం 86.67 చొప్పున పోలింగ్‌ శాతం నమోదైంది.
- రాజమండ్రి రూరల్‌లో 2014 ఎన్నికల్లో 73.97 శాతం, 2019లో 74.21 శాతం పోలింగ్‌ నమోదు కాగా, ఈసారి 73.02 శాతం మంది మాత్రమే ఓట్లు వేశారు.
- రాజానగరంలో 2014లో 85.93 శాతం, 2019లో 87.83 శాతం పోలింగ్‌ నమోదవగా, ఈసారి అది 87.53గా నిర్ధారణ అయ్యింది.

తూర్పున ఫ్యాన్‌ గాలి?



జిల్లాలో మళ్లీ ఫ్యాన్‌ గాలి బలంగా వీచే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే ఎంపీ స్థానం పక్కాగా గెలుపొందే అవకాశం ఉందని చెబుతున్నారు. మెజార్టీ ఎమ్మెల్యే స్థానాలు దక్కించుకునే అవకాశం ఉందని లెక్కలు వేస్తున్నారు. కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల్లో మళ్లీ ఫ్యాన్‌ గాలి వీచ్చే సూచనలు స్పష్టంగా దర్శనమిస్తున్నాయి. అనపర్తి, రాజానగరంలో ఫ్యాన్‌ గిర్రున తిరిగే అవకాశం ఉంది. రాజమండ్రి సిటీ, రూరల్‌లో టీడీపీ కంచుకోటలు బద్దలయ్యే సూచనలున్నాయని భావిస్తున్నారు.



ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్‌రూముకు సీల్‌ వేస్తున్న కలెక్టర్‌ మాధవీలత, ఇతర అధికారులు

జిల్లాలో పోలింగ్‌ వివరాలు ఇలా..

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు
అనపర్తి	2,26,053	1,94,924
రాజానగరం	2,16,491	1,89,505
రాజమండ్రి సిటీ	2,67,484	1,80,733
రాజమండ్రి రూరల్‌	2,72,826	1,99,220
కొవ్వూరు	1,84,136	1,58,176
నిడదవోలు	2,13,396	1,80,688
గోపాలపురం	2,42,763	2,10,399

టెన్షన్‌.. టెన్షన్‌

- ఇన్నాళ్లుగా ప్రచారం, వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగి తేలిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు.. పోలింగ్‌ పూర్తవడంతో గెలుపోటములపై అంచనాలు వేయడం మొదలుపెట్టారు. ప్రత్యర్థికి ఎక్కడ అనుకూలంగా ఓట్లు పోలయ్యాయి, మన బలమెంత, విజయావకాశాలు ఎలా ఉన్నాయనే అంశాలపై కసరత్తు ప్రారంభించారు. ప్రత్యర్థి కంటే ఎలక్షనీరింగ్‌ సమర్థంగా నిర్వహించామని, కచ్చితంగా విజయం తమనే వరిస్తుందని భావిస్తున్నారు. ఎక్కడ ఎన్ని ఓట్లు తమకు అనుకూలంగా పోలయ్యాయనే లెక్కలు తీస్తున్నారు.

ఎవరికి లాభమో!

మొత్తం మీద జిల్లాలో పోలింగ్‌ భారీగానే జరగడం, ఓట్లు వేసిన వారిలో మహిళలే అధికంగా ఉండటం ఎవరికి లాభం చేకూరుస్తుందనే చర్చ సర్వత్రా నడుస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందిన మహిళలు పోలింగ్‌ కేంద్రాలకు భారీగా తరలివచ్చి, వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు పలికారని, వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మరోసారి అధికార పీఠంపై కూర్చోబెట్టేందుకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో తరలిరావడం వైఎస్సార్‌ సీపీ తిరిగి అధికారంలోకి వస్తుందనేందుకు నిదర్శనమనే భావన ప్రజల్లో కలుగుతోంది. కొందరు యువతీ యువకులు సైతం తమ విద్యావసరాల కోసం జగనన్న అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాల ద్వారా లబ్ధి చేకూరిన కారణంగా సీఎం వైఎస్‌ జగన్‌ పాలన తిరిగి రావాలని ఓటు వేసినట్టు బహిరంగంగా వెల్లడించడం విశేషం. హైదరాబాద్‌, బెంగళూరు, ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 80 వేల మంది ఓటర్లు వచ్చారని సమాచారం.

స్ట్రాంగ్‌ రూములకు ఈవీఎంలు

సోమవారం రాత్రి వరకూ కొనసాగిన పోలింగ్‌ ప్రక్రియ ముగిసిన వెంటనే ఈవీఎంలను కేంద్ర బలగాల రక్షణలో నన్నయ వర్సిటీలోని స్ట్రాంగ్‌ రూములకు తరలించారు. వర్సిటీ నార్త్‌ బ్లాక్‌ గ్రౌండ్‌ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌ రూముల్లో ఈవీఎంలను భద్రపరచి సీల్‌ వేశారు. రికార్డులు, ఈవీఎంలలో పోలైన ఓట్ల సంఖ్యపై రాజకీయ పార్టీలు, అభ్యర్థుల సమక్షంలో స్క్రూట్నీ నిర్వహించారు. అందులో ఎటువంటి లోపాలూ లేకపోవడంతో పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడి ఈవీఎంలను వచ్చే నెల 4న కౌంటింగ్‌ సమయంలో తిరిగి బయటకు తీయనున్నారు.

న్యూస్‌రీల్‌

వైఎస్సార్‌ సీపీ శ్రేణులకు మంత్రి వనిత కృతజ్ఞతలు



తానేటి వనిత

దేవరపల్లి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా దాదాపు మూడు నెలలుగా రేయింబవళ్లు వైఎస్సార్‌ సీపీ విజయానికి సైనికుల్లా పని చేసిన గోపాలపురం నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, బూత్‌ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులు, అభిమానులు, సోషల్‌ మీడియా కన్వీనర్లకు పార్టీ అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం దేవరపల్లి మండలం యర్నగూడెంలోని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్‌ నాలుగున జరగనున్న ఓట్ల లెక్కింపులో కూడా ఏజెంట్లు ఇదే ఉత్సాహంతో పాల్గొనాలని ఆమె కోరారు. నాలుగో తేదీన నియోజకవర్గంలో వైఎస్సార్‌ సీపీ జెండా రెపరెపలాడడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

ఈవీఎంలు నన్నయలో భద్రం



ఎన్నికల పరిశీలకుడు బాలసుబ్రహ్మణ్యం సమక్షంలో స్క్రూట్నీ నిర్వహిస్తున్న కలెక్టర్‌ మాధవీలత తదితరులు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ ముగిసిన అనంతరం ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలోని స్ట్రాంగ్‌ రూములకు సాయుధ బలగాల బందోబస్తు నడుమ తరలించారు. కొన్ని కేంద్రాల్లో సోమవారం అర్ధరాత్రి వరకూ పోలింగ్‌ జరిగింది. దీంతో రాత్రంతా ఈవీఎంలను నన్నయ వర్సిటీకి తీసుకుని వస్తూనే ఉన్నారు. తెల్లవారుజాము వరకూ వచ్చిన ఈవీఎంలను ఆయా రిసెప్షన్‌ కౌంటర్ల ద్వారా స్వీకరించారు. అనంతరం సాధారణ ఎన్నికల పరిశీలకుడు కె.బాలసుబ్రహ్మణ్యం సమక్షంలో వాటిని పరిశీలించి, నియోకవర్గాల వారీగా కేటాయించిన స్ట్రాంగ్‌ రూముల్లో భద్రపరిచారు. రాజకీయ పార్టీల అభ్యర్థుల సమక్షంలో ఈ ప్రక్రియ జరిగింది. ఆయా గదులకు సీల్‌ వేసి, కేంద్ర బలగల రక్షణ ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ కె.మాధవీలత మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి ఎ.చైత్రవర్షిణి, రాజమండ్రి లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజవకర్గాల అభ్యర్థులు, వారి ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలీసు యంత్రాంగానికి ఎస్పీ అభినందనలు



ఎస్పీ జగదీష్‌

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో జిల్లా పోలీసు యంత్రాంగం చేసిన కృషిని ఎస్పీ పి.జగదీష్‌ మంగళవారం ఒక ప్రకటనలో అభినందించారు. అక్కడక్కడ చెదురుమదురు సంఘటనలు మినహా జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని తెలిపారు. పక్కా ప్రణాళికతో పోలీసు యంత్రాంగాన్ని ముందుండి నడిపించి, ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఎన్నికల విధి నిర్వహణలో పూర్తి సహాయ సహకారాలు అందించిన జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇద్దరు టీడీపీ కార్యకర్తలపై కేసు

నిడదవోలు రూరల్‌: మండలంలోని రావిమెట్ల గ్రామంలో వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలపై దాడిచేసిన ఘటనలో ఇద్దరి టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్‌ మంగళవారం తెలిపారు. రావిమెట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌ సీపీ ఎన్నికల ఏజెంట్‌ చిలుకూరి చిట్టిప్రసాద్‌కు, టీడీపీ కార్యకర్తలకు సోమవారం పోలింగ్‌ సమయంలో ఎన్నికల బూత్‌ వద్ద వివాదం తలెత్తింది. దీంతో చిట్టిప్రసాద్‌పై టీడీపీ కార్యకర్తలు కొట్టేందుకు వెళ్లారు. వారిని అడ్డుకునేందుకు వెళ్లిన చిట్టిప్రసాద్‌ కుమారుడు భవానీ శివశంకరకుమార్‌పై దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితుడు భవానీ శివశంకర్‌కుమార్‌ ఇచ్చిన ఫిర్యాదుపై టీడీపీ కార్యకర్తలు రాంగోను శ్రీను, రాంగోను సత్యానారాయణపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు.

రత్నగిరికి కల్యాణశోభ

- 18 నుంచి సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలు
- 24 వరకూ నిర్వహణ
- 19వ తేదీ రాత్రి స్వామివారి కల్యాణం

అన్నవరం: సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుడే అనంత లక్ష్మీ సత్యవతీదేవి సమేతుడై వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రంగా అన్నవరం ప్రసిద్ధికెక్కింది. ఇక్కడ పావన పంపా నదీ తీరాన రత్నగిరిపై వెలసిన భక్తవరదుడు.. శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామి వారి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలకు చురుకుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్వామివారికి ఎడమ భాగాన లక్ష్మీదేవి అంశగా దేవేరి శ్రీ అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, కుడివైపున శంకరుడు ఒకే పానవట్టంపై దర్శనమిచ్చే దివ్యధామం ఈ హరిహర క్షేత్రం. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా సత్యదేవుని ఖ్యాతి జగద్విఖ్యాతం.

కల్యాణోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

రత్నగిరిపై సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలు ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకూ అంగరంగ వైభవంగా నిర్వహించడానికి దేవస్థానం ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 19వ తేదీ రాత్రి 9 గంటల నుంచి 11.030 గంటల వరకూ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. సత్యదేవుని కల్యాణ మహోత్సవ ఏర్పాట్లపై గత నెల 28వ తేదీన పెద్దాపురం ఆర్‌డీఓ జె.సీతారామారావు అధ్యక్షతన అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్‌, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, దేవస్థానం అధికారులతో సమీక్ష నిర్వహించారు. విభాగాల వారీగా కార్యాచరణ రూపొందించారు.

నిత్య కల్యాణాలు రద్దు

కల్యాణోత్సవాల ఏర్పాట్లపై దేవస్థానం అధికారులతో ఈఓ కె.రామచంద్ర మోహన్‌ గడచిన వారం రోజుల్లో రెండుసార్లు సమావేశమై ఏర్పాట్లు పురోగతిపై చర్చించారు. కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అందరూ కృషి చేయాలని ఆదేశించారు. ప్రధానంగా 19వ తేదీన జరిగే స్వామివారి కల్యాణం, 22న జరిగే రథోత్సవం సందర్భంగా తీసుకోవలసిన చర్యలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకూ సత్యదేవుని నిత్య కల్యాణాలను రద్దు చేశారు. ఈ నెల 25 నుంచి తిరిగి ఈ కల్యాణాలు నిర్వహిస్తారు.

ఇదీ కల్యాణోత్సవాల క్రమం

- మే 18: వైశాఖ శుద్ధ దశమి శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రధానాలయంలోని అనివేటి మండపంలో అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని, సత్యదేవుడిని వధూవరులుగా అలంకరిస్తారు. అనంతరం రామారాయ కళావేదిక మీద స్వామి, అమ్మవార్లకు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు.
- మే 19: వైశాఖ శుద్ధ ఏకాదశి ఆదివారం రాత్రి 9 నుంచి 11.30 గంటల వరకూ రత్నగిరిపై వార్షిక కల్యాణ వేదిక మీద స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు ప్రసాదం, తలంబ్రాలు పంపిణీ చేస్తారు.
- మే 20: వైశాఖ శుద్ధ ద్వాదశి సోమవారం ప్రధాన స్థాలీపాక హోమాలు, రాత్రి 7 గంటలకు అరుంధతీ నక్షత్ర దర్శనం నిర్వహిస్తారు.
- మే 21: వైశాఖ శుద్ధ త్రయోదశి మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు అనివేటి మండపంలో పండిత సదస్యం నిర్వహిస్తారు.
- మే 22: వైశాఖ శుద్ధ చతుర్దశి బుధవారం సాయంత్రం 5 గంటలకు కొండ దిగువన దేవస్థానం గార్డెన్స్‌లో సత్యదేవుని వనవిహారోత్సవం.
- మే 23: వైశాఖ పౌర్ణమి గురువారం ఉదయం 8.30 గంటలకు పంపా నదిలో స్వామివారి శ్రీచక్రస్నాన మహోత్సవం. సాయంత్రం 4 గంటలకు రత్నగిరిపై అనివేటి మండపంలో నీలలోహిత గౌరీపూజ, నాకబలి, దండియాడింపు, ధ్వజావరోహణం, కంకణ విమోచన కార్యక్రమాలు.
- మే 24: వైశాఖ బహుళ పాడ్యమి శుక్రవారం రాత్రి 7 గంటలకు నిత్య కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లకు శ్రీ పుష్పయాగం కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి.

సీతారాములే పెళ్లి పెద్దలు

భద్రాద్రి రాముని కల్యాణోత్సవం తరువాత తెలుగు రాష్ట్రాల్లో అంత ప్రాముఖ్యత కలిగిన వేడుక సత్యదేవుని దివ్యకల్యాణం. ఈ వేడుకకు సీతారాములే పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తారు. అన్నవరం క్షేత్ర పాలకునిగా శ్రీరాముడు పూజలందుకుంటున్న విషయం తెలిసిందే. ఆ హోదాలో సత్యదేవుని కల్యాణోత్సవాలకు సీతారాములే పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తుండటం ఇక్కడి సంప్రదాయం.

ప్రత్యేక ఆకర్షణగా రథోత్సవం

సత్యదేవుని కల్యాణోత్సవాల్లో భాగంగా ఈ నెల 22వ తేదీన నిర్వహించే రథోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. స్వామివారికి రూ.1.04 కోట్ల వ్యయంతో భారీ టేకు రథంపై నిర్మించిన విషయం తెలిసిందే. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు ఈ రథంపై రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ రథాన్ని ఇప్పటికే గత నెల 26న లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆ రథానికి రంగులు వేసే కార్యక్రమంతో పాటు, ఆరు చక్రాలకు పట్టీలు, హైడ్రాలిక్‌ బ్రేకులు, హైడ్రాలిక్‌ జాకీలు, ముందు భాగంలో రెండు గుర్రాలు అమర్చే పనులు చురుకుగా జరుగుతున్నాయి. ఈ పనులన్నీ ఈ నెల 16వ తేదీకల్లా పూర్తి చేసి, ఆ రోజు ఉదయం 9 గంటలకు పూర్తి స్థాయిలో ట్రయల్‌ రన్‌ వేయనున్నారు. దీనికోసం రథం ఉన్న పంపా సత్రం గేట్లు తొలగించి ర్యాంపు ఏర్పాటు చేస్తున్నారు. పంపా సత్రం నుంచి మెయిన్‌ రోడ్డు మీదుగా సత్యదేవుని తొలి పావంచా వద్దకు తీసుకుని వెళ్లి, అక్కడి నుంచి మళ్లీ పంపా సత్రానికి తీసుకుని వస్తారు. రథాలను లాగడంలో అనుభవం కలిగిన ధవళేశ్వరానికి చెందిన నిపుణులను ఈ రథోత్సవానికి తీసుకుని వస్తున్నామని అధికారులు తెలిపారు.



ఆదిమూలంవారిపాలెంలో మణిబాబు ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



వాసంశెట్టి సూర్యనారాయణ



చిలకలపూడి మణిబాబు



ఈరి కట్లయ్య



నూకపెయ్యి శివ

ఇంటికి చేరే వేళ మృత్యు గంట

- తెల్లారిన కూలీల బతుకులు
- ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్‌
- రోడ్డు ప్రమాదంలో నలుగురు కూలీల మృతి
- ధాన్యం బస్తాలు లోడ్‌ చేస్తుండగా దుర్ఘటన
- మృతదేహాల వద్ద కుటుంబ సభ్యుల రోదన
- న్యాయం చేయాలంటూ రహదారిపై ఆందోళన



ఊడిమూడిలో ధాన్యం ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పి.గన్నవరం/అంబాజీపేట: వారంతా రెక్కాడితేగాని డొక్కాడని పేద కుటుంబాలకు చెందిన కూలీలు. జీవనాధారంలో భాగంగా ట్రాక్టర్‌ పై ధాన్యం బస్తాలు లోడ్‌ చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఆర్టీసీ బస్‌ రూపంలో మృత్యువు వారిని కాటేసింది. ప్రధాన రహదారి నెత్తురోడింది. మృతుల కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. కూలి పనులకు వెళ్లిన వారు తిరిగి మరో 30 నిమిషాల్లో ఇంటికి చేరతారనుకున్న సమయంలో విగత జీవులు అయారనే వార్త తెలియడంతో వారి కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి. పి.గన్నవరం మండలం, ఊడిమూడి గ్రామం వద్ద ఆర్‌.పి.రోడ్డుపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఊడిమూడి గ్రామం వద్ద చింతావారిపేట సమీపంలో రోడ్డు పక్కన ట్రాక్టర్‌ పై ధాన్యం బస్తాలను పది మంది కూలీలు లోడ్‌ చేసి పగ్గం కడుతున్నారు. అదే సమయంలో రాజోలు నుంచి రావులపాలెం వెళుతున్న ఆర్టీసీ బస్‌ ట్రాక్టర్‌ను వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్‌, ట్రాక్టర్‌ల కింద పడి కూలీలు మృత్యువాత పడ్డారు. జి.పెదపూడికి చెందిన నూకపెయ్యి శివ (35), వాసంశెట్టి సూర్యనారాయణ (45), ఈరి కట్లయ్య (50), ఊడిమూడి శివారు ఆదిమూలంవారిపాలెంకు చెందిన చిలకలపూడి మణిబాబు (30) అక్కడికక్కడే మృతి చెందారు. ఆదిమూలవారిపాలెంకు చెందిన చిలకలపూడి సురేష్‌కు తీవ్ర గాయాలు కాగా అమలాపురం ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. జి.పెదపూడికి చెందిన బొరుసు నానికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. బొరుసు రాంబాబు, బుజ్జి, వాసంశెట్టి సాయికిరణ్‌, గూనపాటి పెద్దిరాజులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఆర్టీసీ బస్‌లో 20 మంది ప్రయాణికులున్నారు. ఇద్దరు మహిళలకు స్వల్పగాయాలు అయ్యాయి. బస్‌ డ్రైవర్‌ పరారీలో ఉన్నాడు.

రెండు గ్రామాల్లో విషాద ఛాయలు...

మరో 30 నిమిషాల్లో ఇళ్లకు చేరుకోవల్సిన వారు విగత జీవులుగా మారడంతో జి.పెదపూడి, ఆదిమూలంవారిపాలెం గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు అందరినీ కంటతడి పెట్టించాయి. జి.పెదపూడికి చెందిన నూకపెయ్యి శివ కొబ్బరి వలుపు కార్మికుడిగా, కూలీగా పని చేసేవాడు. మృతునికి భార్య బేబి కుమారి, సుశాంత్‌, జస్వంత్‌ అనే చిన్న పిల్లలు ఉన్నారు. భర్త శివ మరణించడంతో ఆ కుటుంబం దిక్కులేనిదయ్యిందని బంధువులు, కుటుంబ సభ్యులు రోదించారు. అదే గ్రామానికి చెందిన వాసంశెట్టి సూర్యనారాయణ మృతి చెందడంతో భార్య దుర్గ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. సూర్యనారాయణ కుమార్తె నాగేశ్వరికి ఆరు నెలల క్రితం వివాహం జరిగింది. ఇంటిలో శుభకార్యం జరిగి ఏడాది తిరగ కుండానే అందరిని వదలి వెళ్లిపోయాడని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన వీరి కట్లయ్యకు భార్య సుబ్బలక్ష్మి, కుమారులు నాగరాజు, సురేష్‌, కుమార్తెలు వైష్ణవి, హారికలు ఉన్నారు. అతని మృతితో పెద్ద దిక్కును కోల్పోవడమే కాకుండా జీవనాధారం కోల్పోయామని కుటుంబీకులు విలపిస్తున్నారు. ఆదిమూలంవారిపాలెంకు చెందిన చిలకలపూడి మణిబాబు మృతి చెందడం, అతని అన్న సురేష్‌ తీవ్ర గాయాలపాలై ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో వారి తల్లితండ్రులు వెంకటేశ్వరరావు, సత్యనారాయణమ్మ రోదనలు గ్రామస్తులకు కంటతడి పెట్టించాయి. అందరితో కలివిడిగా ఉండే మణిబాబు మృతి చెందడం, సురేష్‌ తీవ్ర గాయాలు పాలవ్వడంతో బంధువులు, స్నేహితులు బోరున విలపిస్తున్నారు.

ఆందోళన చేపట్టిన గ్రామస్తులు

నిర్లక్ష్యంగా, మితి మీరిన వేగంతో బస్సును నడిపి నలుగురు మృతికి కారణమైన బస్‌ డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేస్తూ జి.పెదపూడి, ఊడిమూడికి చెందిన నాయకులు, గ్రామస్తులు ఆర్పీ రోడ్డుపై ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్‌ చేశారు. కలెక్టర్‌, ఎస్పీ, ఆర్టీవోలు రావాలని నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత వాతావారణం నెలకొనడంతో పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్‌, ఎస్సై బి.శివకృష్ణ ఆందోళన కారులతో చర్చించారు. ఆర్డీఓ సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ మొత్తం పెంచాలని మృతుల కుటుంబ సభ్యులు ఆందోళన కొనసాగిస్తున్నారు.



రాస్తారోకో చేస్తున్న ఆందోళనకారులు



ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుంటున్న జెడ్పీ చైర్మన్‌ విప్పర్తి

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం : జెడ్పీ చైర్మన్‌ విప్పర్తి

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు అండగా ఉండి, ఆదుకుంటామని జెడ్పీ చైర్మన్‌, వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మృతుల కుటుంబాలను మంగళవారం రాత్రి ఆయన పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని సూచించారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని కిమ్స్‌ ఆస్పత్రి వైద్య సిబ్బందికి సూచించారు.

క్లుప్తంగా

సత్యదేవునికి గొడుగుల సమర్పణ



దేవస్థానం అధికారులకు గొడుగులను అందజేస్తున్న రంగనాథ్, శ్రీవల్లి దంపతులు

అన్నవరం: గుడివాడకు చెందిన అమ్మ కన్‌స్ట్రక్షన్స్ అధినేత మాటూరి రంగనాథ్, శ్రీవల్లి దంపతులు సత్యదేవుని ఊరేగింపులో వాడే గొడుగులను మంగళవారం స్వామివారికి సమర్పించారు. వీటిని ప్రతి రోజు స్వామివారి ఊరేగింపులో ఉపయోగించాలని దాత దంపతులు కోరినట్లు ఏఈఓ కృష్ణారావు తెలిపారు.

సెల్‌ఫోన్ షాపులో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కాజులూరు: మండల కేంద్రమైన కాజులూరులో మంగళవారం ఒక సెల్‌ఫోన్ షాపులో అగ్నిప్రమాదం సంభవించి సర్వం కాలిబూడిదయింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో జెడ్పీ హైస్కూల్ ఎదుట ఉన్న బలభద్రుని కామేష్ సెల్‌ఫోన్ షాపులో తెల్లవారుజామున మంటలు సంభవించాయి. లోపల నుంచి పొగలు వస్తుండటంతో అటుగా వెళుతున్న స్థానికులు గమనించి షాపు యజమానికి సమాచారమందించారు. ఆయన హుటాహుటిన వచ్చి షాపు షట్టరు తెరవగా లోపల మంటలు ఎగసి పడుతున్నాయి. కాకినాడ అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించగా సిబ్బంది వచ్చి మంటల ఆర్పివేశారు. అయితే అప్పటికే షాపులోని సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచీలు, జిరాక్స్ మెషీన్లతో పాటు ఖరీదైన వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఆస్తి నష్టం సుమారు రూ.15 లక్షలు ఉంటుందని యజమాని తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

బోటు తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడలో ఉన్న ఉమ్మిడి విజయ్‌కుమార్‌కు చెందిన బోట్ల తయారీ కేంద్రంలో మంగళవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో ఫైబర్ షీట్లు, బోటు తయారీ పరికరాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.7లక్షల నష్టం వాటిల్లినట్టు విజయ్‌కుమార్ తెలిపారు.

పాడి పశువుల సంరక్షణ కోసం

రాజానగరం: గ్రామీణ ప్రాంతాలలో రైతులు పశు సంపదను ఎంతో అపురూపంగా చూసుకుంటారు. పాడి పశువులు అనారోగ్యానికి గురైతే అన్నదాతలు ఎంతగానో తల్లడిల్లిపోతారనే విషయాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో తొలిసారిగా హైడ్రాలిక్ సిస్టమ్‌తో కూడిన వైఎస్సార్ సంచార వైద్యశాలలను ఏర్పాటు చేశారు. 108 తరహాలోనే వీటికి కూడా 1962 టోల్‌ఫ్రీ నంబరును కేటాయించి, రైతన్నల పశుసంపద పరిరక్షణకు చేదోడు వాదోడుగా నిలిచారు. 2022 మే 19న ప్రారంభమైన ఈ ఉచిత సర్వీసు ద్వారా నియోజకవర్గంలో ఇంతవరకు 4,085 పాడి పశువులకు వైద్య సేవలందించారు.

- మినీ గోకులం (ఆరు పశువులకు సరిపడేలా షెడ్డు నిర్మించుకునేందుకు) పథకం ద్వారా యూనిట్‌కి రూ. ఒక లక్ష 40 వేలు చొప్పున రూ. ఒక కోటి 80 వేల వ్యయంతో 72 షెడ్డులను నిర్మించారు.

పాడి-పంట

- పశు నష్టం (ఆవు, గేదె, మేక, గొర్రె) వాటిల్లిన సమయంలో రైతులను ఆదుకునేలా అమలు చేస్తున్న పశు నష్ట పరిహార పథకం (దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేదు, రైతులు ఒక్క రూపాయి కూడా ప్రీమియం చెల్లించనవసరం లేదు) ద్వారా 405 మంది రైతులకు రూ. కోటి 21 లక్షల 50 వేలు పరిహారంగా అందజేశారు.
- కేవలం రూ.340 ప్రీమియంతో మూడేళ్ల కాల వ్యవధితో కూడిన వైఎస్సార్ పశు బీమా పథకం (ప్రమాదాలలో మరణించిన పశువులకు) ద్వారా 40 మంది రైతులకు రూ.12 లక్షలు బీమా చెల్లించారు.



వైఎస్సార్ సంచార పశు వైద్యశాలకు కేటాయించిన హైడ్రాలిక్ సిస్టమ్‌తో కూడిన వాహనం, సిబ్బంది

- ఒక లక్ష 96 వేల పశువులకు, పెంపుడు జంతువులకు గడచిన నాలుగేళ్లలో గాలి కుంటు, హెచ్.ఎస్. దొమ్మ, బ్రూసిల్లా, లింకిస్కిన్ డిసీజెస్, పీపీఆర్ పొంగు, షీప్ పాక్స్ వ్యాధులు సోకకుండా వ్యాధి నిరోధక టీకాలతోపాటు నట్టల నివారణకు రూ. 40 లక్షలు ఖర్చు చేశారు.
- ఉచిత కృత్రిమ గర్భధారణ పథకం అమలు ద్వారా రూ. ఒక లక్ష 68 వేలు వెచ్చించారు.
- మేలు రకం పశుగ్రాస విత్తనాల సరఫరాకు రూ. 3.45 లక్షలు ఖర్చు చేశారు.

తమ పార్టీ వ్యక్తినే కిడ్నాప్ చేసిన జనసేన కార్యకర్తలు

మలికిపురం: మండలంలోని రామరాజులంక గ్రామంలో జనసేన కార్యకర్త రేకపల్లి నాగరాజును ఆ పార్టీ కార్యకర్తలే కిడ్నాప్ చేశారు. సోమవారం గ్రామంలోని పోలింగ్ స్టేషన్‌లో ఓటు ముందుగా వేసే విషయంలో గ్రామంలోని జనసేన కార్యకర్తలు పోటీ పడ్డారు. ఈ నేపథ్యంలో జరిగిన ఘర్షణలో రేకపల్లి నాగరాజును తోసేశారు. వాగ్వాదం జరిగింది. దీంతో నాగరాజు వ్యతిరేక వర్గమయిన అదే గ్రామానికి చెందిన వ్యక్తుల బంధువులు అయిన గూడపల్లి, కేశనపల్లి గ్రామాలకు చెందిన జనసేన యువకులు నాగరాజును సోమవారం సాయంత్రం కిడ్నాప్ చేసినట్టు నాగరాజు తండ్రి సూర్య నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిడ్నాప్‌కు గురయిన నాగరాజు దొరికాడని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు

ఇరువర్గాల మధ్య ఘర్షణ





శ్రీనును పరామర్శిస్తున్న చలమలశెట్టి సునీల్, తోట నరసింహం

కిర్లంపూడి: ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో వైఎస్సార్ సీపీ కార్యకర్తకు తీవ్ర గాయాలు అయ్యాయి. మండల పరిధి వేలంకలోని పోలింగ్ బూత్‌లో సోమవారం వైఎస్సార్ సీపీ కార్యకర్త అడబాల శ్రీనుపై దాడి జరిగింది. ఈ దాడిలో శ్రీను తీవ్రంగా గాయపడడంతో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పిఠాపురం మండలం, పవర గ్రామంలో ఉన్న ట్రినిటి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం ఆసుపత్రికి పరామర్శించారు. జరిగిన ఘటనపై అడిగి తెలుసుకున్నారు. వారి వెంట మండల సచివాలయాల కన్వీనర్ జోకా శ్రీను, దోమాల గంగాధర్ పలువురు ఉన్నారు.

ఏపీఆర్‌జేసీ ఫలితాలలో తిరుమల హవా



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో అకడమిక్ డైరెక్టర్ సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీహరి

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాలలో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఎంపీసీ విభాగంలో ఫస్ట్ ర్యాంకు, సెకండ్ ర్యాంకు, బైపీసీ విభాగంలో సెకండ్ ర్యాంకులతో పాటు టాప్‌టెన్‌లో ఎనిమిది ర్యాంకులను సాధించి అత్యుత్తమ ఫలితాలను అందించారని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమి చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. జే.యశ్వంత్‌సాయి స్టేట్ ఫస్ట్‌ర్యాంకును, జి.ప్రభవ్‌తేజ స్టేట్ సెకండ్ ర్యాంకును, ఎం.మారుతి సత్యశ్రీకర్ స్టేట్ సెకండ్ ర్యాంకును, పీవీఎస్ సూర్యధావన్ రాష్ట్రస్థాయిలో ఐదవ ర్యాంకును, బీఎస్ఎస్ భవ్య రాష్ట్రస్థాయి ఆరవ ర్యాంకును, ఎంకెఎస్ సాకేత్ రాష్ట్రస్థాయి ఆరవ ర్యాంకును, డి.శ్రీవేద్ రాష్ట్రస్థాయి 8వ ర్యాంకును, సీహెచ్ త్రివేణి రాష్ట్రస్థాయి 10వ ర్యాంకును కైవసం చేసుకున్నారని ఆయన తెలిపారు. 10లోపు 8మంది, 50లోపు 26మంది, 100లోపు 46మంది ర్యాంకులు సాధించారని నున్న తిరుమలరావు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను నున్న తిరుమలరావు, డైరెక్టర్ సరోజినిదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.

వైఎస్సార్ సీపీ నేతలపై టీడీపీ దాడులు



ఆత్రేయపురంలో వైఎస్సార్ సీపీ నాయకులపై దాడి చేస్తున్న తెలుగుదేశం పార్టీ నేతలు



ఆత్రేయపురంలో పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

- కేసు నమోదు చేసిన పోలీసులు
- పరిస్థితిని సమీక్షించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: ఎన్నికల పోలింగ్ ముగిసినా ఇంకా తెలుగుదేశం పార్టీ నేతల దాడులు ఆగడం లేదు. వైఎస్సార్ సీపీ నాయకులపై దాడికి తెగబడడంతో ఆత్రేయపురంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. ఆత్రేయపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు వెంకట కృష్ణంరాజు అలియాస్ గోపి, అతని తమ్ముడు భాస్కర విజయ నరసింహరాజు ఓటు వేయడానికి సోమవారం పోలింగ్ బూత్‌కు వెళ్లినప్పుడు తెలుగుదేశం పార్టీ నేత ముదునూరి బద్రిరాజు కొంతమందితో కలిసి వీరితో ఘర్షణ పడ్డాడు. ఈ నేపథ్యంలో వెంకట కృష్ణంరాజు, అతని తమ్ముడు విజయ్ మంగళవారం ఉదయం గ్రామంలో ఉన్న రావిచెట్టు వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో పోలింగ్ బూత్ వద్ద వీరితో గొడవ పడిన ముదునూరి బద్రిరాజు మరికొంత మందిని తీసుకుని అక్కడికి చేరుకున్నారు. ఇరు వర్గాలు తలపడ్డాయి. దీంతో ఇరువర్గాల వారికి గాయాలయ్యాయి. దీనిపై పరస్పరం ఫిర్యాదులు చేసుకోగా ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఇరువర్గాలను చెదరగొట్టే సమయంలో ఎస్ఐ శ్రీనివాస్‌కు కూడా గాయాలయ్యాయి. దాడి చేసిన వ్యక్తులపై, అల్లర్లకు పాల్పడిన ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.



దాడిలో గాయపడ్డ వైఎస్సార్ సీపీ నేతలు

ఆత్రేయపురంలో వివాదం సద్దుమణిగింది: డీఎస్పీ కేవీ రమణ

ఎన్నికల నేపథ్యంలో ఆత్రేయపురంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ మధ్య ఏర్పడిన వివాదం సద్దుమణిగిందని డీఎస్పీ కేవీ రమణ తెలిపారు. ఆత్రేయపురంలో ఇరు పార్టీలకు చెందిన వ్యక్తులు వాట్సాప్‌లో ఒకరిపై ఒకరు చాలెంజ్‌లు చేసుకోవడంతో వివాదం తలెత్తిందన్నారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు.

బెదిరింపులకు భయపడం:ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఓటమి భయంతో తెలుగుదేశం పార్టీ నేతలు వైఎస్సార్ సీపీ నేతలపై దాడులకు పాల్పడుతున్నారని, అలాంటి బెదిరింపులకు భయపడేది లేదని కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం ఆత్రేయపురంలో వైఎస్సార్ సీపీ నేతలపై జరిగిన దాడి ఘటన తెలుసుకుని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గ్రామానికి చేరుకున్నారు. పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నేతలు హద్దులు దాటితే తాము సహించబోమని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ నాయకులకు కార్యకర్తలకు ఎల్లవేళలా తాను అండగా ఉంటామని జూన్ 4 వరకు ఓపికతో ఉండాలని కోరారు. వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని అన్నారు.

హత్య కేసు నిందితులపై హత్యాయత్నం

- సరిహద్దు వివాదం, పాత కక్షతో ప్రతీకార చర్యకు యత్నం
- అయిదేళ్ల బాలిక తలకు గాయం... మరో వ్యక్తికి స్వల్ప గాయం
- దాడి చేసిన వ్యక్తికి స్థానికుల దేహశుద్ధి

అమలాపురం టౌన్: తన భార్యను హత్య చేశారన్న అక్కసుతో పాత కక్షను దృష్టిలో పెట్టుకుని భర్త ఓ కుటుంబంపై మంగళవారం ఉదయం హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలో మెయిన్ రోడ్డుపై జరిగిన ఈ హత్యాయత్న ఘటనతో స్థానికులు ఉలిక్కి పడ్డారు. అమలాపురం రూరల్ మండలం సమనస గ్రామానికి చెందిన కోండ్రు కోటేశ్వరరావు అదే గ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గతంలో తన భార్యను హత్య చేసిన ఆ కుటుంబంలోని ఇంటి యజమాని, ఇద్దరు కొడుకులు, అల్లుడు, అల్లుడు కుమార్తె అయిదేళ్ల చిన్నారిపై కోండ్రు కోటేశ్వరరావు ఈ హత్యాయత్నానికి ప్లాన్ చేశాడని పోలీసులు తెలిపారు. పట్టణ సీఐ కె.కృష్టోఫర్ కథనం ప్రకారం...సమనస గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ కోండ్రు కోటేశ్వరరావు, మంగం బాలయోగి కుటుంబాల మధ్య సరిహద్దు తగాదాలు ఉన్నాయి. దీంతో కోటేశ్వరరావు భార్యను అమలాపురం ఎన్టీఆర్ మార్గ్‌లో 2012 సంవత్సరంలో మంగం బాలయోగి కుటుంబీకులు హత్య చేశారు. అప్పటి నుంచి ఈ రెండు కుటుంబాల మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది. ఆ హత్య కేసుకు సంబంధించి మంగం బాలయోగి, అతని ఇద్దరి కుమారులు, అల్లుడు మంగళవారం అమలాపురంలోని కోర్టు వాయిదాకు వచ్చారు. వారితో పాటు బాలయోగి మనమరాలు (కూతురు కుమార్తె) చొప్పెల గుణశ్రీ (5) కూడా ఉంది. తన భార్య హత్య కేసులో కోర్టు వాయిదాకు బాలయోగి కుటుంబీకులు వస్తున్నారన్న సమాచారంపై పాత కక్షతో ప్రతీకార చర్య తీసుకోవాలన్న కోపంతో కోటేశ్వరరావు కత్తితో తన ఆటోలో అమలాపురం వచ్చి మాటు వేశాడు. తొలుత బాలయోగి కుటుంబీకులను ఆటోతో ఢీకొట్టి వారిపై హత్యాయత్నానికి తెగబడ్డాడు. అయితే బాలయోగి కుటుంబీకులు దాదాపు తప్పించుకున్నారు. అయితే వారి కూడా ఉన్న మనమరాలు గుణశ్రీకి కత్తి వేటు పడి తలకు గాయమైంది. ఆ బాలికను తక్షణమే సమీపంలో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలయోగి కుమారుడు విజయ్ కూడా దాడిలో స్వల్పంగా గాయపడ్డాడు. నడి రోడ్డుపై కత్తితో దాడికి పాల్పడడం, ఓ చిన్నారిని గాయపరచడంతో స్థానికులు కోటేశ్వరరావుకు దేహశుద్ధి చేశారు. స్థానికుల చేతిలో గాయపడ్డ కోటేశ్వరరావు కూడా స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రితో చికిత్స పొందుతున్నాడు. కోటేశ్వరరావుపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ క్రిష్టోఫర్ తెలిపారు.



చికిత్స పొందుతున్న చిన్నారి గుణశ్రీ

బాలయోగి కుటుంబీకులపైనా కేసు నమోదు

కోండ్రు కోటేశ్వరరావుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లుగానే అతడు గాయపడ్డ ఘటనపై కూడా బాలయోగి కుటుంబీకులపై కేసు నమోదు చేస్తామని పట్టణ సీఐ కె.కృష్టోఫర్ తెలిపారు. ఘటనా స్థలాన్ని అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు కూడా సందర్శించి పరిశీలించారు. కోటేశ్వరరావును బాలయోగి కుటుంబీకులు కూడా ప్రతిఘటించారన్న సమాచారంపై కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, దర్యాప్తు ఆధారంగా వారిపై కూడా కేసు నమోదు చేస్తామని సీఐ చెప్పారు. ఇరు పక్షాల నుంచి అందిన ఫిర్యాదులపై విచారిస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని తాళ్లరేవు బైపాస్ రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, కోరంగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాళ్లరేవు పరదేశమ్మ వీధికి చెందిన నారాయణరావు బైక్‌పై వెళుతుండగా కారు బైక్‌ను ఢీకొని పక్కనే ఉన్న పంట చేలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురితో పాటు కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. పదేళ్ల కుర్రాడికి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. స్థానికులు హుటాహుటిన వారిని తాళ్లరేవు ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు కాలేదని, వివరాలు తెలియరాలేదని కోరంగి పోలీసులు తెలిపారు.



తాళ్లరేవు బైపాస్ రహదారిలో బైక్‌ను ఢీకొన్న కారు

సీబీఎస్ఈ ఫలితాలలో అగ్రగామిగా నిలిచిన శ్రీ షిర్డీసాయి



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో యాజమాన్య ప్రతినిధులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సీబీఎస్ఈ 10, 12 వ తరగతి ఫలితాలలో శ్రీ షిర్డీ సాయి విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీ విద్య మంగళవారం వెల్లడించారు. 10వ తరగతిలో బీవీఆర్ సాహితి 500 మార్కులకుగాను 484 మార్కులతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, జె.సుహాస్ సాయి 479 మార్కులతో ద్వితీయ స్థానం, ఎ.రేణుసాయిశ్రీ 478 మార్కులతో తృతీయ స్థానం సాధించారన్నారు. ఈ పరీక్షలకు 82 మంది హాజరుకాగా వారిలో 22 మంది 90 శాతం పైగా మార్కులు, 63 మంది విద్యార్థులు 80 శాతం పైగా మార్కులతో డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారన్నారు. తమ కళాశాలలో 12వ తరగతి విద్యార్థిని కె.శ్రీలాస్య 500 మార్కులకుగాను 489 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలువగా, 485 మార్కులతో జి.శ్రీవిద్య ద్వితీయ స్థానం, 481 మార్కులతో బి.లక్ష్మణనాయుడు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. 12వ తరగతిలో మొత్తం 300 మంది విద్యార్థులు హాజరుకాగా 45 మంది 90 శాతం పైగా మార్కులు సాధించగా, 216 మంది 80 శాతం పైగా మార్కులతో డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారన్నారు. బోర్డు ఫలితాలలోనే కాక సీబీఎస్ఈ ఫలితాలలోను తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఇంతటి ప్రతిభ చూపిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయ అధ్యాపక బృందాన్ని శ్రీ షిర్డీసాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, డైరెక్టర్ టి.శ్రీవిద్య, ప్రిన్సిపాల్ జేఎస్‌వీ.ప్రసాదరెడ్డిలు లక్ష్య, దీక్షా, డ్యాఫ్నీ డీన్‌లను అభినందించారు.

18న జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 18వ తేదీన ప్రముఖ ఎల్‌అండ్‌టీ సంస్థ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలవర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఐటీఐ ఉత్తీర్ణులైన ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్, సివిల్, వెల్డర్, ప్లంబర్, వైర్‌మెన్, కార్పెంటరీ ట్రేడ్ విద్యార్థులు అర్హులని, దాదాపుగా 1,600 ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులకు మూడు నెలల శిక్షణ ఉంటుందని, శిక్షణ అనంతరం ఏపీ, తెలంగాణ, చెన్నై, బెంగళూరు రాష్ట్రాల్లో నియమిస్తారని, ఆసక్తి గలవారు ఉదయం 9గంటల్లోపు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

పీచు ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

రూ.1.50 లక్షల ఆస్తినష్టం



గంగలకుర్రులో అగ్ని ప్రమాదంలో దగ్ధమైన కొబ్బరి పీచు

అంబాజీపేట: గంగలకుర్రులో మంగళవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పురవ్వలు పడి కొబ్బరి పీచు ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం సంభవించి రూ.1.50 లక్షల ఆస్తినష్టం సంభవించింది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సానబోయిన రామకృష్ణకు చెందిన శ్రీలక్ష్మీ దుర్గా క్వాయర్ ఇండస్ట్రీకి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. విద్యుత్ వైర్లపై కొబ్బరి ఆకు పడటంతో పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పురవ్వలు చెలరేగి కొబ్బరి పీచు దగ్ధమైంది. ఎగుమతికి సిద్ధంగా ఉన్న పీచు అగ్నికి ఆహుతి కావడంతో రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు రామకృష్ణ తెలిపారు. స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఘటనా స్థలానికి అమలాపురం అగ్నిమాపక దళాధికారి కె.మురళీ కొండబాబు తన సిబ్బందితో చేరుకుని మంటలను ఆర్పివేశారు.

ఫోర్త్ జనరేషన్ స్విఫ్ట్ కార్ మార్కెట్లోకి విడుదల

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సరికొత్త ఫీచర్లతో, జెడ్ సిరీస్ ఇంజన్‌తో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన స్విఫ్ట్ కార్‌ను ఎస్‌బీఐ డివిజనల్ జనరల్ మేనేజర్ ప్రమోద్ కుమార్ మిశ్రా రాజమహేంద్రవరంలో ఆవిష్కరించారు. స్థానిక లాలాచెరువులోని ఎస్‌బి మోటార్స్ షోరూమ్‌లో మంగళవారం జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్ కుమార్ మిశ్రా, రీజనల్ మేనేజర్ తటవర్తి శ్రీనివాస్, వర్ధమాన నటుడు గోల్డెన్‌రెడ్డి, ప్రముఖ రచయిత మను శ్రీ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబాల వారిని సైతం ఆకట్టుకునేలా ఫోర్త్ జనరేషన్ స్విఫ్ట్ కారును మార్కెట్‌లోకి విడుదల చేయడం శుభ పరిణామం అన్నారు. ఎస్‌బీ మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రామ్‌కుమార్, జనరల్ మేనేజర్ ఎంవీఎస్ఎస్ఆర్ గుప్తా మాట్లాడుతూ నేటి యువతరానికి నచ్చేలా.. మెచ్చేలా సరికొత్త భద్రతా ప్రమాణాలతో ఈ కారును తూర్పుగోదావరి జిల్లా మార్కెట్లోకి తీసుకురావడం ఆనందదాయకమన్నారు. ఈ సరికొత్త స్విఫ్ట్ కారు 25.75 కిలోమీటర్ల మైలేజీతో నడవడం మరో అద్భుతం అన్నారు. సిక్స్ ఎయిర్ బ్యాగ్స్‌ను అత్యాధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.



స్విఫ్ట్ కార్‌ను మార్కెట్లోకి విడుదల చేస్తున్న ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్‌కుమార్ మిశ్రా

దాడి కేసు నమోదు

రాయవరం: మండలంలోని కూర్మాపురంలో సోమవారం జరిగిన ఘటనపై ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు దాడి కేసు నమోదు చేసినట్లు రాయవరం ఏఎస్సై పి.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఏఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన వీరబోయిన వీరవెంకటదుర్గాప్రసాద్ వలంటీర్‌గా పనిచేసి ఇటీవల రాజీనామా చేశాడు. సోమవారం నిర్వహించిన ఎన్నికల పోలింగ్ సమయంలో వలంటీర్ బయట వ్యక్తులతో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో జనసేన పార్టీకి చెందిన చెక్కు మహేష్ మరో 13 మంది దుర్గాప్రసాద్ వద్దకు వచ్చిన నీకు ఇక్కడ పనేంటి? ఇక్కడకు ఎందుకు వచ్చావంటూ ఘర్షణకు దిగి, దాడికి పాల్పడ్డారు. గాయాల పాలైన దుర్గాప్రసాద్ రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చేరాడు. ఈ మేరకు ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.